క్లుప్తంగా

ఘనంగా అప్పన్న తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: మాస జయంతిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం తిరువీధి ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవి లను పల్లకిలో అధిష్టంపజేసి సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని తరించారు.

ఆకట్టుకున్న జీ20 మాక్ సదస్సు



వివిధ దేశాల ప్రతినిధులుగా విద్యార్థులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం యువ మంథన్‌లో భాగంగా మాక్ సదస్సు నిర్వహించారు. జీ 20 సభ్య దేశాల ప్రతినిధులుగా విద్యార్థులు వ్యవహరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలు ఏవిధమైన చర్యలు చేపట్టాలో వారి అభిప్రాయాలను వివరించారు. సెప్టెంబర్‌లో ఢిల్లీల్లో నిర్వహించనున్న జీ 20 సదస్సు నమూనాగా ప్రదర్శించారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైవీఎస్ వేణు గోపాల్ అభినందించారు. కార్యక్రమంలో జిలా ఎన్‌జీసీ కోఆర్డినేటర్ సూర్రెడ్డి బాబూరావు, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు ఎస్. విజయ తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు మరమ్మతులు చేయాలని వినతి

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి–ముత్యాలమ్మపాలెం రహదారిలో ముత్యమాంబ ఆలయం వద్ద వంతెన రక్షణగోడ లేక పోవడంతో ప్రజలు భయపడుతున్నారు. సుమారు 50 ఏళ్ల కిందట నిర్మించిన వంతెన కొంత దెబ్బతింది. రక్షణ గోడలు కూలిపోయాయి. దీంతో రాత్రి వేళ అదుపుతప్పి వంతెనపై నుంచి పడిపోతున్నారు. రహదారిని విస్తరించిన సమయంలో రక్షణ గోడ ఏర్పాటు చేయాలని కోరినా ప్రయోజనం లేకపోయిందని మండల కోఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న వాపోయారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదాలకు కారణమవుతున్న వంతెనను తొలగించి రోడ్డుతో సమానంగా వంతెనను ఏర్పాటు చేయాలని కోరారు.

బాబాజీకొండపై శ్రావణ పౌర్ణమికి ప్రత్యేక ఏర్పాట్లు



ఇసుక కొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్ : అన్నవరం సత్యదేవుడి అంతటి ప్రాధాన్యత గల ఇసుకకొండ(బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో రాఖీ (శ్రావణ) పౌర్ణమికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు రూ.20, రూ.200, రూ.300 టికెట్లు అందుబాటులో ఉంచారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలి రానున్నారు. ముందుగా చాలా మంది భక్తులు సాగరతీరంలో స్నానమాచరించి స్వామి దర్శనానికి రానున్నారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు తరలి రానున్న దృష్ట్యా చర్యలు చేపట్టారు. వేకువజాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరపనున్నారు. ధ్వజస్తంభ పూజలు జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయం

ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



శిక్షణ పూర్తి చేసుకున్న యువతికి సర్టిఫికెట్ అందజేస్తున్న జీజీఎం సిన్హా

పరవాడ: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా సింహాద్రి ఎన్టీపీసీ కృషి చేస్తుందని సంస్థ జీజీఎం సంజయ్ కుమార్ సిన్హా చెప్పారు. ఎన్టీపీసీ ప్రాంగణంలో బుధవారం నైపుణ్యాభివృద్ధి శిక్షణ పూర్తి చేసుకున్న మొదటి బ్యాచ్‌కు సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎస్సార్ విభాగం ద్వారా నిర్వాసిత గ్రామాల యువతకు ఉపాధి కల్పించే దిశగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం చేపట్టామన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ ద్వారా మెషిన్ ఆపరేటర్, ఇంజెక్షన్ మోల్డింగ్‌లో విజయవాడలో ఆర్నెల్ల పాటు స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణ అందించడం జరుగుతుందని చెప్పారు. మొదటి బ్యాచ్‌లో 30 మంది యువతకు శిక్షణ ఇచ్చామన్నారు. తొలి బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వడానికి సంస్థ రూ.30.50 లక్షల మేర ఖర్చు చేసిందన్నారు. జూలైలో ప్రారంభం కానున్న రెండో బ్యాచ్‌కు అదే మొత్తాన్ని ఖర్చు చేయనున్నట్టు జీజీఎం సిన్హా చెప్పారు. సంస్థ హెచ్‌వో ఆర్డీ రుమాడి శర్మ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్థిరమైన జీవనోపాధి కల్పించడానికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ దోహదపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన వారికి ఉద్యోగంతో పాటు ఏపీసీఈటీ ద్వారా గుర్తింపు పొందిన ట్రైనింగ్ సర్టిఫికెట్‌లను జీజీఎం సిన్హా అందజేవారు. కార్యక్రమంలో సీజీఎం బి.రామారావు, జీఎం ఎస్.గోవిందరాజన్, ఓ అండ్ ఎం జీఎం డి.పి.పాత్ర, టెక్నికల్ సర్వీస్ జీఎం ఎస్.పద్మప్రియ, జీఎం కె.జగన్‌మోహన్‌రావు, సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్(విజయవాడ) సీహెచ్.శేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి

• అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ



ఎస్పీ మురళీకృష్ణకు స్వాగతం పలుకుతున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. పరవాడ డీఎస్పీ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలో పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మంచి వాతావరణంలో డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేశారని అభినందించారు. డీఎస్పీ సత్యనారాయణ, పరవాడ సీఐ పి.ఈశ్వరరావు ఉన్నారు.

ఆలయ మండపం నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ కనకారావు దంపతులు

పరవాడ: కలపాక శివారు స్వయంభూవరం గ్రామంలో శివాలయం మండపం నిర్మాణానికి సర్పంచ్ బొండా కనకారావు దంపతులు బుధవారం భూమి పూజ చేశారు. ఇప్పటి వరకు ఆలయ మండపం నిర్మాణానికి సహకరించిన దాతలకు సర్పంచ్ కనకారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పూజారి ఎస్.సత్యనారాయణ, బి.పైడినాయుడు, జి.జానకీరామ్, ఇందల రామారావు, ఎం.శ్రీనివాసరావు, ఈ.శ్రీను, ఎ.రామకృష్ణ, టి.నర్సింగరావు, పి.త్రినాథరావు, టి.అప్పారావు, వై.నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంచాలి

అగనంపూడి: ప్రతీ విద్యార్థి ఏదో ఒక గేమ్‌లో పాల్గొనేలా ఆసక్తి కల్గించాలని అనకాపల్లి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు అన్నారు. లంకెలపాలెం హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన పెందుర్తి నియోజకవర్గ పరిధి స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా వ్యాయామ విద్యకు కూడా సమావేశం నిర్వహిస్తుండడం శుభ పరిణామన్నారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పలు క్రీడలు, ఆరోగ్యం విద్య, ఇతర అంశాలపై చర్చించుకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి క్రీడలు, ఆటలపై ఆసక్తి పెంపొందించుకునేలా వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రేరణ కల్గించాలన్నారు. కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం, పరవాడ మండలాల కో–ఆర్డినేటర్లు లక్ష్మీరాణి, లోవరాజు, పెందుర్తి కో–ఆర్డినేటర్లు రెహమాన్, చందన్‌వర్మ, సుజాత, పరవాడ మండల వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు తులసీ సత్యవతి, బి.అన్నాజీరావు, ఎస్.వి.రమణ, శ్రీదేవి, దేవి, అమ్మాజీ, శ్రీలక్ష్మి, గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

అలివేలు మంగాదేవికి విశేషంగా అభిషేకం



కలశాలను తీసుకొస్తున్న భక్తులు



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని జీవీఎంసీ 97వ వార్డు సప్తగిరినగర్‌లో ఉన్న అలివేలు మంగాదేవి ఆలయంలో అమ్మవారికి బుధవారం విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. 108 కలశాలతో భక్తులు పవిత్రాలు తీసుకువచ్చి అభిషేకం చేశారు. నక్షత్ర హారతి అందజేశారు. లక్ష్మీసహస్రనామ పారాయణ, విష్ణు సహస్ర నామపారాయణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ,యజ్ఞోపవీతం, జీలకర్రవెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు. పురోహిత్ అలంకారి కరిసీతారామాచార్యులు తదితరులు కల్యాణం నిర్వహించారు.

భెల్ గుర్తింపు యూనియన్ ఎన్నికలు నేడు



భెల్ పరిపాలనా భవనం

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ ఎన్నికలు గురువారం నిర్వహించనున్నారు. సంస్థ వెల్ఫేర్ బిల్డింగ్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్న పోలింగ్‌లో 446 మంది కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల్లో మూడు యూనియన్లు పోటీలో నిలిచాయి.

- బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయీస్ యూనియన్ (సీరియల్ నం.2): ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ప్యానెల్‌లో ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, వైఎస్సార్ టీయూసీ, ఏఐసీటీయూ, ప్రగతిశీలశక్తుల యూనియన్లు ఉన్నాయి. సీఐటీయూ నుంచి అధ్యక్షుడిగా జి.టి.పి.ప్రకాష్, ఐఎన్‌టీయూసీ నుంచి ప్రధాన కార్యదర్శిగా ఉరుకూటి బాబూరావు పోటీ చేస్తున్నారు.
- యునైటెడ్ ఫ్రంట్ (సీరియల్ నం.3): యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) ప్యానెల్‌లో ఏఐటీయూసీ, బీహెచ్‌పీవీ ఎంఎస్, టీఎన్‌టీయూసీ, వైఎస్సార్ టీయూ, డీఈయూ, బీఈఆర్‌పీటీయూ, యూత్ ఎంప్లాయీస్ యూనియన్లు ఉన్నాయి. బీహెచ్‌పీవీ ఎంఎస్ నుంచి బొండా బాబూరావు అధ్యక్షుడిగా, టీఎన్‌టీయూసీ నుంచి సుభాకర్ సాహు ప్రధాన కార్యదర్శిగా బరిలో ఉన్నారు.
- బీఎంఎస్ యూనియన్ (సీరియల్ నం.1): ఎన్నికల్లో మరో యూనియన్‌గా బీఎంఎస్ బరిలో నిలిచింది.

పోలింగ్ ముగిసిన అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. ఫలితాలను ఎన్నికల అధికారి డి.శ్రీనివాసులు వెల్లడించనున్నారు.

అప్పన్నను దర్శించుకున్న సీబీఐ జాయింట్ డైరెక్టర్ వేణుగోపాల్



ఆశీర్వచనం స్వీకరిస్తున్న వేణుగోపాల్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సీబీఐ జాయింట్ డైరెక్టర్ ఎస్.వేణుగోపాల్ (హైదరాబాద్) దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మడంపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో అర్చకులు ఆయన పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు స్వామివారి ప్రసాదాన్ని,జ్ఞాపికను డీఈవో సుజాత అందజేశారు. సీబీఐ విశాఖ ఏఎస్పీ మురళి ఆయన వెంట ఉన్నారు.

ఎన్‌ఐపీఎం నూతన కార్యదర్శిగా శేషగిరిరావు



ఎన్‌ఐపీఎం నూతన కార్యవర్గ సభ్యులు

ఉక్కునగరం: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐపీఎం), విశాఖ చాప్టర్ నూతన కార్యదర్శిగా స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీనియర్ మేనేజర్ బి. శేషగిరిరావు ఎన్నికయ్యారు. స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం జరిగిన ఎన్‌ఐపీఎం వార్షిక సాధారణ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో ముందుగా 2022–23 వార్షిక నివేదికను సభకు అందజేశారు. ఆ వ్యవధిలోని లెక్కలను సభకు కోశాధికారి తెలియజేశారు. అనంతరం జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికలో శేషగిరిరావు కార్యదర్శిగా రెండోసారి ఎన్నికయ్యారు. చైర్మన్‌గా డాక్టర్ ఎస్.వి.ఎస్. సుధాకర్, వైస్ చైర్మన్లుగా ఎన్.రాజారెడ్డి, బి.శ్రీకాంత్, అదనపు కార్యదర్శిగా డాక్టర్ బి.కృష్ణ కుమారి, కోశాధికారిగా కె.గున్నేశ్వర అనిల్‌తో పాటు ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

హాస్టల్ భవనం పరిశీలన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థినుల వసతి గృహం ప్రగతి భవనాన్ని బుధవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి పరిశీలించారు. వచ్చే నెలలో విద్యార్థులు వచ్చే సమయానికి హాస్టల్ మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. హాస్టల్ గదులు, టాయిలెట్స్, డైనింగ్ రూమ్ వంటివి పూర్తి స్థాయిలో మరమ్మతులు పూర్తి చేసి, పెయింటింగ్ వేయాలని సూచించారు. నూతనంగా పలు గదులను నిర్మించే అంశంపై వార్డెన్ వినుత, యూనివర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావుతో చర్చించి, తగిన సూచనలు చేశారు. నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆకట్టుకున్న కథా కచేరీ



కథ వినిపిస్తున్న మేడా మస్తాన్‌రెడ్డి

సీతంపేట: సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కథా కచేరీ వైవిధ్యమైన అంశాంతో అందరినీ అలరించింది. సంస్థ అధ్యక్షుడు శేఖర మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథలతో మానసిక వికాసం కలుగుతుందన్నారు. రచయితలు తమ కథల ద్వారా మానవాళికి మమత, మానవత్వపు పరిమళం, మానవీయ విలువలు సమాజానికి చాటిచెప్పాలన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ రచయితకు తను చెప్పే విషయంపై నిర్దిష్ట అభిప్రాయం ఉండాలన్నారు. కథలను సమీక్షించారు. రచయిత మేడా మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ కథకులకు కథలు వినిపించడానికి అవకాశం కల్పించినందుకు సహృదయ సాహితికి ధన్యవాదాలు తెలిపారు. కథా కచేరి ద్వారా ఎందరో రచయితలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం రచయితలు కె.వి.ఎస్.మూర్తి, భాగవతుల సత్యనారాయణ మూర్తి, చిన్న సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, కళ్లేపల్లి స్వర్ణలలిత, మేడా మస్తాన్‌రెడ్డి, రామతాత, కొత్తూరి రమణ, ఆర్.సుబ్బలక్ష్మి తదితరులు కథలు వినిపించారు.

గడపగడపకు సంక్షేమ పథకాలు



గవరజగ్గయ్యపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అక్కిరెడ్డిపాలెం: అర్హతే ప్రాతిపదికగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతీ గడపకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిదే అని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా 88వ వార్డు గవరజగ్గయ్యపాలెంలో బుధవారం సాయంత్రం ఆయన పర్యటించారు. మహిళలు ఆయనకు హారతులిచ్చి స్వాగతించారు. ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను నెరవేర్చారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు, వృద్ధాప్య పెన్షన్లు అందిస్తున్న వలంటీర్లు దేశానికే దిక్సూచిగా నిలిచారన్నారు. చిన్నారులకు చాక్లెట్లు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఆళ్ల సత్య అప్పారావు, ఆళ్ల శ్రీనివాసరావు, జగ్గయ్యపాలెం అధ్యక్షుడు కాండ్రేగుల ఈరినాయుడు, ఆళ్ల బూలిరాజు, పొలమరశెట్టి బూలిరాజు, బుదిరెడ్డి కృష్ణ, శతకంశెట్టి శ్రీను, వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో సాగు లాభదాయకం

ఎంపీపీ బోకం సూర్యకుమారి



మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: రైతులు సాగులో యాంత్రీకరణను ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటి గా మార్చుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని గుల్లేపల్లి రైతు భరోసా కేంద్రంలో హైరింగ్ సెంటర్(సీహెచ్‌సీ) ద్వారా యంత్ర పరికరాలు తీసుకున్న సభ్యులు, రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు సచివాలయాల పరిధిలో రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. మండలంలోని ఏర్పాటు చేసిన 17 రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా రైతులకు అవసరమయ్యే యంత్రాలు,యంత్ర పరికరాలను అందుబాటులో ఉంచేందుకు కస్టం హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసిందన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సీహెచ్‌సీల వివరాలను రైతులందరికీ తెలియజేసి వారి అవసరాలకు యంత్ర పరికరాలు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. యంత్ర పరికరాలను వినియోగించడం ద్వారా సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధ్యమవుతాయని చెప్పారు. సమావేశంలో మండ వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బండారు శ్రీను, ఉప సర్పంచ్ గజ్జి దేముడు బాబు, వ్యవసాయ సహాయకులు హేమలత తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం

డీఎంహెచ్‌వో హేమంత్



సబ్బవరం పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీచేస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

సబ్బవరం: వివిధ అనారోగ్య సమస్యలతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ సూచించారు. సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు.ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించి,రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈహెచ్‌ఆర్ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు ఐడీ క్రియేట్ చేసి రోగులకు ఇవ్వాలని సూచించారు. అదే విధంగా పీహెచ్‌సీలోని 104 డ్రగ్ స్టోర్‌ను పరిశీలించి మందులు తరలించే విధానంపై పలు సూచనలు చేశారు. గొటివాడలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించి అక్కడ రికార్డులు తనిఖీచేశారు. క్లినిక్ నిర్వహణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ఆర్ చక్రవర్తి, డాక్టర్ బి. ఆశ, ఎంపీహెచ్‌వో జేసుదాస్ మిగిలిన వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్లకు అవకాశం కల్పించాలి



సబ్ రిజిస్ట్రార్ రత్నకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దస్తావేజు లేఖర్లు

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా తీసుకుచ్చిన కార్డు ప్రైమ్ 2.0 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానానికి తాము వ్యతిరేకం కాదని.. దీంతో పాటు దస్తావేజు లేఖర్లకు డాక్యుమెంటు రాసుకునే అవకాశం కల్పించాలని మండలంలోని దస్తావేజు లేఖర్లు కోరారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రం సంఘం ఇచ్చిన పిలుపు మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం దస్తావేజు లేఖర్లు బుధవారం నిరసన వ్యక్తం చేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, పేదలకు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేంత అవగాహన లేదన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం నుంచి దస్తావేజు లేఖర్ల ద్వారా అన్నిరకాల రిజిస్ట్రేషన్ వ్యవహారాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానాన్ని తామంతా ప్రోత్సహిస్తామన్నా రు. దీనిపై ఆధారపడిన తమ కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సబ్ రిజిస్ట్రార్ రత్నకుమార్‌కు దస్తావేజు లేఖరులు వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శి శేఖరమంత్రి శ్రీనివాసరావు, బిక్కవిల్లి రాంబాబు, రత్నాజీ, సీతారామమూర్తి,బోకం ఈశ్వర పాలవెల్లి,జూరెడ్డి శ్రీరాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల పెన్ డౌన్

సింహాచలం: ఏపీ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్‌మెంట్ రిజిస్ట్రేషన్‌లో ప్రవేశపెట్టిన నూతన విధానాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపు మేంకు బుధవారం పెందుర్తి దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్ చేశారు. గురువారం కూడా పెన్ డౌన్ ఉంటుందని లేఖర్లు తెలిపారు. దసావేజు లేఖర్లు పితాని నాగరాజు, రాష్ట్ర నాయకులు బలగ చిన్నారావు, పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ భారతి

అగనంపూడి: ఒకరు చేసే నేత్ర దానం ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపుతుందని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి అన్నారు. 38వ జాతీయ అంధత్వ నివారణ పక్షోత్సవాల సందర్భంగా అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో జిల్లా అంధత్వ శాఖ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సంయుక్తంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మరణం తరువాత కూడా ప్రకృతిని వీక్షించే అవకాశం నేత్ర దానం వల్ల కలుగుతుందన్నారు. ఇద్దరి జీవితాల్లో వెలుగునివడంతో పాటు మరణం తరువాత కూడా బతికుండే అవకాశం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నేత్రదానం ఆవశ్యకతపై పోస్టర్లు విడుదల చేశారు. ఆర్ఎంవో డాక్టర్ ఉష, గోపీకృష్ణ, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ ఆశాశ్రీ,, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, యంగ్ ఇండియా అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ తృప్తి, ఆప్తమాలిక్ అధికారులు కె.ఎస్.సరళ, ధనలక్ష్మి, రాజశేఖర్, రమణి తదితరులు పాల్గొన్నారు.